క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: శామీర్‌పేట్ మండలం అలియాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఘనాపూర్ గ్రామంలో అన్ని సర్వీసులకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

హోటల్ ప్రారంభం



హోటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో తులిప్ గ్రాండ్ హోటల్‌ను మంత్రి టి.హరీశ్‌రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక, ఆతిథ్య రంగాలను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన పెరగాలి

ఘట్‌కేసర్: సైబర్ క్రైంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని రాచకొండ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ సురేందర్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ)లో ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్–1, 4 ఆధ్వర్యంలో సైబర్ క్రైంపై ఎస్ఐ ప్రవీణ్‌రావుతో కలిసి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాల్స్ వంటి వ్యాపార కేంద్రాల్లో వ్యక్తిగత సమాచారం ఇతరులతో పంచుకోవద్దన్నారు. సైబర్ క్రైం జరిగినప్పుడు 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వడంతో నష్టాన్ని తగ్గించవచ్చని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు ముందుకు రావాలని వారు సూచించారు. సదస్సులో ఏయూ అడ్మిషన్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నవీన్, కిరణ్‌కుమార్, బాబాశంకర్, వలంటీర్లు సింధు, అభిషేక్, మహేందర్, అనీశ్, దీపక్, శాంత పాల్గొన్నారు.

ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న శివాజీ తదితరులు

ఘట్‌కేసర్: నార్సింగి,పీర్జాదిగూడ శ్రీ చైతన్య కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు శివాజీనాయక్ ఆధ్వర్యంలో అవుషాపూర్ శ్రీ చైతన్య కళాశాల వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఫీజులు, ర్యాంకుల పేరుతో ఒత్తిడి తీసుకొచ్చి విద్యార్థుల ప్రాణాలు తీస్తున్నారని శివాజీనాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎస్‌యూఐ కార్యకర్తలు అభిలాష్, దిలీప్, ఆకాశ్, అర్జున్, మైశరన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతన తిప్పలు

- గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా అందని జీతాలు
- కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన
- ఊరి కోసం చాకిరీ చేస్తున్నా గుర్తింపు లేదంటున్న కార్మికులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నిత్యం పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారమై వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని గ్రామ పంచాయతీ కార్మికులు వాపోతున్నారు. వారికి నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన జీతాలు రావాల్సి ఉంది. వేతనాలు ఇవ్వాలని వేడుకుంటున్న గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాలి.

చాకిరీ ఎక్కువే..

ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 51 ప్రకారం మల్టీపర్పస్ వర్కర్లుగా గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులు



ఉదయం 5 గంటల నుంచి పారిశుద్ధ్య పనులు నిర్వహించాలి. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడం, వీధి దీపాలు ఆర్పడం, తాగునీటి సరఫరా తదితర కీలక విధులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చిన సమయంలో, ఎవరింట్లోనైనా శుభకార్యం జరిగినప్పుడు ఆయా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బ్లీచింగ్ చల్లుతుంటారు. వీటితో పాటు సర్వేలు, డ్రై డే, ఫ్రైడే వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాల్సిందే. కరోనా కష్టకాలంలో వీరు ఎనలేని సేవలు అందించారు. పంచాయతీ కార్మికులు పనిచేసే క్రమంలో గాయాలపాలైనా, మరణించినా ప్రభుత్వం నుంచి అందుతున్న సాయం రూ.5 వేలు మాత్రమేనని వారు ఆవేదన చెందుతున్నారు. ఊరి కోసం గొడ్డుచాకిరి చేస్తున్న కార్మికులకు సర్కారు చేసే మేలు ఇదేనా అని పలువురు కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ట్రాక్టర్ ప్రమాదాలు, స్తంభాల మీద బుగ్గలు(లైట్లు) వేసే క్రమంలో కార్మికులు చనిపోతున్నా సర్కారు పట్టించుకోవడం లేదని ఈఎస్ఐ, పీఎఫ్, బీమా వంటి సౌకర్యాలు లేకపోవడం దారుణమని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు 45 వేల మంది కార్మికులు..

రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల పరిధిలోని 12,750 గ్రామాల్లో అధికారిక లెక్కల ప్రకారం 35 వేల మంది కార్మికులు పని చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ అనాధికారికంగా 45 వేల మంది ఉంటారని పలు కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. వీరందరినీ మల్టీపర్పస్ వర్కర్లుగా పిలుస్తున్నారు. పంచాయతీ కార్మికులకు నూతన పంచాయతీ చట్టం ప్రకారం నెలకు రూ.8.500 చొప్పున వేతనాలు చెల్లించాల్సి ఉండగా, రూ.5 వేల నుంచి రూ.6,500 మాత్రమే అందజేస్తున్నట్లు వారు చెబుతున్నారు. ప్రభుత్వం నిధులపై ఫ్రీజింగ్ విధించడంతో ట్రెజరీ నుంచి విడుదల కావడం లేదని పంచాయతీ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ సమస్య తలెత్తిందని, త్వరలోనే వేతనాలు ఇస్తామని చెబుతున్నారు.

- హైదరాబాద్ నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 619 గ్రామ పంచాయతీలు ఉండగా.. 4,779 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ప్రతినెలా రూ.4.06 కోట్లు చెల్లిస్తున్నారు.

అప్పులు చేయాల్సి వస్తోంది

గ్రామ పంచాయతీ కార్మికులకు నెలనెలా జీతం ఇవ్వకపోవడంతో అప్పులతో జీవితాన్ని వెళ్లదీయాల్సి వస్తోంది. స్కూల్ ఫీజు మొదలుకొని నిత్యావసరాలు, కరెంటు బిల్లులు తదితర అవసరాల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ఒక్కోసారి అప్పు సైతం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– రవి, పారిశుద్ధ్య కార్మికుడు, మేడ్చల్ జిల్లా

జీవో 51ను రద్దు చేయాలి

గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులు ఒక్కరి వేతనాన్ని ఇద్దరు పంచుకోవడం ఆందోళన కలిగిస్తోంది. చేసే పని ఒకటైనా మున్సిపల్, పంచాయతీ కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం ఉంది. గ్రామ పంచాయతీ సిబ్బందిలో అత్యధికులు దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన పేదలు ఉన్నారు. ఒక కార్మికుడికి ఇచ్చే వేతనాన్ని గ్రామంలో పనిచేసే కార్మికులందరూ పంచుకుంటే ఒక్కొక్కరికి రూ.1500 నుంచి రూ.4 వేలు వస్తోంది. ప్రభుత్వం 51 జీవోతో మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని తీసుకొచ్చి పని భారం పెంచింది. ఆ జీవోను వెంటనే రద్దు చేయాలి. పంచాయతీ కార్మికులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేయాలి.

– పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి



యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంత్రి మల్లారెడ్డి గురువారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం దాతల నుంచి సేకరించిన రూ.11లక్షల విరాళాన్ని ఆయన ఆలయ అధికారులకు అందజేశారు.

– మేడ్చల్

విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా మహేంద్రాచారి

ఘట్‌కేసర్: అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా కొర్రెముల్ గ్రామానికి చెందిన మహేంద్రాచారి ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథం ఆయనకు గురువారం నియామకపత్రం అందజేశారు. విశ్వకర్మల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా మహేంద్రాచారి అన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న మహేంద్రాచారి

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవ దృశ్యం

మేడ్చల్: మేడ్చల్ రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి రథంశాల వరకు స్వామి వారి రథాన్ని భక్తులు లాగారు. వచ్చటి తోరణాలతో, విద్యుత్ దీపాలతో రథాన్ని సుందరంగా అలంకరించి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. గురువారం ఉదయం స్వామి వారికి దోపు సేవ, లంకాదహనం నిర్వహించడంతో జాతర ప్రారంభమైంది.



మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

అన్నదానం..

జాతర సందర్భంగా పెద్ద ఎత్తున్న అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కౌన్సిలర్ మణికంఠ ఆధ్వర్యంలో ఆలయంలో, మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల్లో భక్తులకు అన్నదానం చేశారు. మున్నూరుకాపు సంఘ అన్నదాన కార్యక్రమాన్ని తీన్మార్ మల్లన్న ప్రారంభించారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ కురుమనగర్, లక్ష్మీనరిసింహ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానికులతో కలిసి కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ అధ్యక్షుడు అబ్బయ్య, దుర్గం నవీన్, గోవింద్ కుమార్ స్వామి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్ యాదవ్, జంపు గోవర్ధన్, పి.రామచందర్ ఉన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ సిబ్బంది రెండో రోజు సమ్మెలో భాగంగా గురువారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ ధర్నా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కనీస వేతనాలు పెంచాలని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సమ్మె కార్యక్రమం శుక్రవారం సైతం కొనసాగుతుందన్నారు. సమ్మెలో సీఐటీయూ జిల్లా నాయకులు లింగస్వామి, కిష్టప్ప, గణేష్ వెంకన్న, యూనియన్ అధ్యక్షురాలు సునీత పాల్గొన్నారు.

పెట్రోల్, గ్యాస్ పైపులైన్ లీకేజీలపై మాక్ డ్రిల్



పైపులైన్ లీకైన ప్రాంతంలో కెమికల్స్ స్ప్రే చేస్తున్న సిబ్బంది



లీకైన పైపులైన్‌కు మరమ్మతులు చేసే విధానాన్ని వివరిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) సంయుక్తంగా గురువారం ఆఫ్ సైట్ మాక్ డ్రిల్ నిర్వహించారు. పెట్రోల్, గ్యాస్ పైపు లైన్ లీకేజీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్పందించాల్సిన తీరుపై సిబ్బంది మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలం సమీపంలోకి ప్రజలు రాకుండా చేసే హెచ్చరికలు, మంటలు చుట్టు పక్కలకు వ్యాప్తించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లీకై న పెట్రోల్‌ను ఈఆర్‌వీ ద్వారా ట్యాంకర్‌లోకి సరఫరా చేయడం వంటి విధానాలను ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం హెచ్‌పీసీఎల్, గెయిల్ ఇన్‌చార్జ్ డీజీఎం రఘుపతి, ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ డీజీఎం ఏఎస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడైనా పైపులైన్ లీకేజీ అయితే తక్షణమే సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పైపు లైన్ ప్రదేశంలో ఎలాంటి తవ్వకాలు, మొక్కలు నాటడం, ఇంటి నిర్మాణం వంటివి చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, రాచకొండ ఏసీపీ జి.శ్రీను, అంకుషాపూర్ సర్పంచ్ జలజ, ఉప సర్పంచ్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ నుంచి కాళ్లకల్‌కు నూతన బస్ సర్వీస్

మేడ్చల్: విద్యార్థులకు అనువైన సమయాల్లో మేడ్చల్ నుంచి మెదక్ జిల్లా కాళ్లకల్ వరకు నూతన ఆర్టీసీ సర్వీస్‌ను మేడ్చల్‌లో అధికారులు ప్రారంభించారు. విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు, తిరిగి ఇంటికి చేరుకునేందుకు వీలుగా బస్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రతిరోజూ నాలుగు ట్రిప్పులు నడుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎం సుధాకర్ పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



మేడ్చల్ జిల్లా: నగర శివారు ఉప్పల్‌లోని పెట్రోల్ బంకులను గురువారం తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రెండు ఇండియన్ ఆయిల్ రిటైల్ అవుట్‌లెట్‌లు, రెండు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిటైల్ అవుట్‌లెట్లు, ఒక హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ రిటైల్ అవుట్‌లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో శాఖ ప్రాంతీయ అధికారి జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయండి

అల్వాల్: అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబిత కిషోర్ అన్నారు. డివిజన్ పరిధిలోని న్యూగ్రామర్స్ పాఠశాల వద్ద రూ.16 లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా వేగంగా పూర్తి చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, సంతోష్, మల్లేష్‌గౌడ్, కల్పన పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నాగారంలోని ఏడీఈ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కీసర: పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ఇవ్వాలని, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని కోరుతూ టీఎస్‌పీఈజేఏసీ కీసర డివిజన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు గురువారం మధ్యాహ్నం డివిజన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, గొంగ్లర నరసింహ, చైర్మన్ కిషన్(ఏడీఈ), కన్వీనర్ భాస్కర్ రావు, కె.శ్రీనివాస్, సాగర్, రేణుక, కామేశ్వరరావు, సతీష్‌రెడ్డి, జంయగ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ ఎస్‌జేఆర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని పట్టణ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ రాములును కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, జాకట ప్రేందాస్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, మల్లేష్, శ్రీకాంత్, గాంధీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఎగిసిన ధరల మంటలు



గ్యాస్ ధర పెంపుపై నిరసన వ్యక్తం చేస్తున్న జవహర్‌నగర్ మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

- గ్యాస్ ధర పెంపుపై భగ్గుమన్న బీఆర్ఎస్
- పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు
- కేంద్ర ప్రభుత్వంపై మండిపడిన నేతలు

కీసర: వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ గురువారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, గ్యాస్ ధర పెంచి మరింత భారం మోపడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించి ఎన్నికలు ముగియగానే మళ్లీ ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. మహిళలు ఖాళీ సిలిండర్‌లతో నిరసన వ్యక్తం చేసి కట్టెల పొయ్యిపై వంట చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు బండారి మల్లేష్ యాదవ్, మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్, కౌకుట్ల తిరుపతిరెడ్డి, నేతలు గూడురు అంజన్న, వెంకట్‌రెడ్డి, కౌకుట్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడాన్ని నిరసిస్తూ జవహర్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. జవహర్‌నగర్‌లో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. మేకిన్ ఇండియా అంటూ గొప్పలు చెప్పే ప్రధాని మోదీ పేదలపై భారం మోపడం ఏంటని ప్రశ్నించారు. కార్పొరేటర్లు ఏకే మురుగేష్, బింగి లావణ్య, కో ఆప్షన్ సభ్యులు శోభారెడ్డి, శ్వేత, బీఆర్ఎస్ నాయకులు మహేష్, చందర్, సిద్దులుయాదవ్, శేఖర్, ప్రకాష్, మహేష్, కేతమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్: గ్యాస్ సిలిండర్ ధర పెరుగుదలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మేడ్చల్‌లో ధర్నా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహ వద్ద సిలిండర్‌ల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావనీయాదవ్



దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో..



నాగారం మున్సిపాలిటీలో..



మేడ్చల్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బోడుప్పల్: విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేటప్పుడు, ఇంటికి వచ్చేటప్పుడు కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో గురువారం కుక్కల నుంచి ఎలా తప్పించుకోవాలనే విషయంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలు రోడ్డుపై ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు..

అల్వాల్: ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని రెండు గంటల్లో పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. నేరెడ్‌మెట్ సీఐ నర్సింహస్వామి వివరాల ప్రకారం.. డిఫెన్స్ కాలనీలో నివాసం ఉండే పి.నివాస్(09) స్థానికంగా డీఏవీ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక ఇంట్లో నుంచి గురువారం ఉదయం పారిపోయాడు. తల్లిదండ్రులు స్థానికంగా గాలించినా ఆచూకీ లభించకపోవడంతో నేరెడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని రెండు గంటల్లో బాలుడిని తల్లిదండ్రులకు

గ్రాడ్యుయేషన్ డే

ఘట్‌కేసర్: చౌదరిగూడ రోటర్‌డ్యామ్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డేను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సూర్య ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మహతి మల్లా హాజరై యూకేజీ పూర్తి చేసుకొని ఒకటో తరగతికి వెళ్తున్న చిన్నారులకు పట్టాలు అందజేశారు. ప్రిన్సిపాల్ రూపారెడ్డి, డైరెక్టర్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే గ్రాడ్యుషన్ డే నిర్వహించామన్నారు. విద్యార్థులు ఏది అడిగినా ఇవ్వకుండా కష్టపడడం అలవాటు చేయాలని, ప్రతిరోజూ కొద్దిపాటి సమయాన్ని వారికోసం కేటాయించాలని తల్లిదండ్రులకు సూచించారు.



బీజేఆర్‌నగర్‌లో నీటి ఎద్దడికి చెక్

మల్కాజిగిరి: బీజేఆర్ నగర్‌లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బీజేఆర్ నగర్‌లో జలమండలి జీఎం సునీల్‌కుమార్, సీజీఎం సుజాతతో కలిసి గురువారం పర్యటించారు. తాగునీరు ప్రెషర్‌తో రావడం లేదని, యూజీడీలో పైపులైన్లు పాతవి కావడంతో మ్యాన్‌హోల్స్ నిండి రోడ్డుపై పారుతున్నాయని అన్నారు. 150ఎంఎం పైపులైన్ పనులు జరుగుతున్నాయని, పూర్తికాగానే తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండవని కార్పొరేటర్ తెలిపారు. యూజీడీ పైపులైన్ సామర్థ్యం కూడా పెంచుతామన్నారు. కార్యక్రమంలో బాబు, రంగమ్మ, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.